సాక్షి
నిర్మల్
సోమవారం ‌: 27 ‌జనవరి ‌2025



వేదికపై కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీ షర్మిల, అదనపు ఎస్పీలు రాజేశ్ మీనా, ఉపేందర్‌రెడ్డి



ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్



ప్రసంగిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్

ప్రజా సంక్షేమమే లక్ష్యం

- పథకాలను అర్హులకందిస్తాం
- పారదర్శకంగా పనులు చేపడతాం
- సమష్టిగా జిల్లా అభివృద్ధికి పాటుపడదాం
- గణతంత్ర వేడుకలో కలెక్టర్ ప్రసంగం
- జిల్లాలో ఘనంగా రిపబ్లిక్‌డే సంబురాలు

నిర్మల్/నిర్మల్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందించేందుకు పారదర్శకంగా పనిచేయడమే తమ లక్ష్యమని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలందరం కలిసి సమష్టిగా జిల్లా అభివృద్ధికి పాటు పడదామన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం జిల్లా కేంద్రంలోని మినీస్టేడియంలో అడిషనల్ కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్‌కుమార్, ఎస్పీ జానకీ షర్మిలతో కలిసి జాతీయ జెండావిష్కరణ చేశారు. పోలీసు బలగాల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఆమె గణతంత్ర దినోత్సవ ప్రసంగపాఠం వినిపించారు.

శాఖల ద్వారా సంక్షేమం..

పేదల వైద్య కోసం ఆరోగ్యశ్రీ ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు రూ.26 కోట్ల 35 లక్షలు ఖర్చు చేశామన్నారు. రూ.500కే వంటగ్యాస్‌లో భాగంగా లక్షా 14వేల 173 మంది లబ్ధిదారులకు ఇప్పటివరకు రూ.9కోట్ల 89 లక్షల సబ్సిడీని అందించామన్నారు. గృహజ్యోతిలో భాగంగా లక్షా 23వేల 556 కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా చూస్తామన్నారు. ప్రభుత్వం తొలివిడతలో నియోజకవర్గానికి 3,500 చొప్పున

అర్హులందరికీ పథకాలు..

ఇందిరమ్మ ఇళ్లను ఇచ్చినట్లు చెప్పారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న అర్హులకు రూ.5లక్షల సబ్సిడీతో ఇళ్లను నిర్మించనున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా భూమిలేని వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు ఇచ్చే ప్రక్రియ ప్రారంభమైందన్నారు. జిల్లాలో 27,417 మంది అర్హులు ఉన్నట్లు గుర్తించామన్నారు. జిల్లాలో 72,500 మంది రైతు కుటుంబాలకు రూ.585 కోట్ల రుణమాఫీ చేసినట్లు చెప్పారు. రైతుభరోసా ద్వారా ఇప్పుడు అర్హులైన రైతుల ఖాతాల్లో ఎకరానికి రూ.12వేల చొప్పున జమచేస్తామన్నారు. మహాలక్ష్మి పథకం ద్వారా జిల్లాలో ఇప్పటి వరకు 2,088,7,613 మంది ఉచిత బస్సు సౌకర్యం ఉపయోగించుకున్నారని, ఇందుకు రూ.110 కోట్ల 56 లక్షలను ప్రభుత్వం కేటాయించిందన్నారు.

బాలశక్తి ద్వారా..

రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా జిల్లాలో వినూత్నంగా బాలశక్తి కార్యక్రమాన్ని ప్రారంభించామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకు ఆర్థిక, ఆరోగ్య, సామాజిక నైపుణ్యాలను మెరుగుపరుస్తున్నామన్నారు.

న్నారు. అమ్మరక్షిత కార్యక్రమం ద్వారా జిల్లాలో మాతాశిశు మరణాలు తగ్గించేందుకు కృషి చేస్తున్నామన్నారు. జిల్లాలో 977మంది గర్భిణుల్లో రక్తహీనతను గుర్తించి తగు కౌన్సెలింగ్, సేవలు అందిస్తున్నట్లు చెప్పారు.

అవార్డులూ అందుకున్నం..

జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్మల్‌రూరల్ మండలం కొండాపూర్‌లోని గణపతి స్వయం సహాయక సంఘం ఆధ్వర్యంలో చేసిన సమీకృత వ్యవసాయ విధానానికి పెప్సికో సంస్థ నుంచి జాతీయస్థాయిలో రివల్యూషనరీ అవార్డు అందుకున్నామన్నారు. ఫార్మ్ పాండ్స్ ద్వారా మత్స్యసంపద అభివృద్ధి చేస్తున్నందుకు ఉత్తమ మత్స్య సలహాదారు అవార్డు పొందామన్నారు. ఒకేరోజు 5,940 రూఫ్‌టాప్ రెయిన్ వాటర్ హార్వెస్టింగ్‌లను నిర్మించినందుకు వరల్డ్ రికార్డు ఇండియా అవార్డుతో పాటు స్కోచ్ ఇండియా–2024లో సెమీఫైనల్ అర్హత సాధించినట్లు వివరించారు. జిల్లాను శాంతియుతంగా ఉంచేందుకు పోలీసుశాఖ నిరంతరం శ్రమిస్తోందన్నారు. నిర్మల్ చరిత్ర, ఔన్నత్యాన్ని చాటేందుకు ఈనెల 5 నుంచి నాలుగురోజుల పాటు 'నిర్మల్ ఉత్సవాలు' ఘనంగా నిర్వహించామన్నారు. అనంతరం నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు, శకటాలు, స్టాళ్ల ప్రదర్శన చూపరులను ఆకట్టుకున్నాయి.

పునరావాసం..

జిల్లాలో కవ్వాల్ టైగర్ రిజర్వు పరిధిలో ఉన్న మైసంపేట్, రాంపూర్ గ్రామాలకు సంబంధించిన 142 కుటుంబాలకు పునరావాసం కల్పించామన్నారు. రూ.14కోట్ల 20లక్షలతో సాగు భూమి, మౌలిక సదుపాయాల కల్పన చేపట్టామన్నారు. మత్స్యశాఖద్వారా జిల్లాలోని 555 చెరువుల్లో దాదాపు 2కోట్ల 9 లక్షల చేప పిల్లలను వందశాతం సబ్సిడీపై విడుదల చేశామన్నారు.

కలెక్టరేట్‌లో గణతంత్ర వేడుకలు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ అభిలాష అభినవ్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించి జాతీయ గీతం ఆలపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా ప్రజలకు, అధికారులకు, సిబ్బందికి గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్‌కుమార్, జిల్లా అధికారులు, సిబ్బంది, పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



పోరాట స్ఫూర్తిని నింపాలి

- ఎస్పీ జానకీ షర్మిల

నిర్మల్‌టౌన్: భవిష్యత్ తరాల్లో స్వాతంత్ర్య సమరయోధుల పోరాట స్ఫూర్తిని నింపాలని ఎస్పీ జానకీ షర్మిల అన్నారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రధాన పోలీస్, ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఎస్పీ మాట్లాడుతూ ఎందరో త్యాగధనుల ఫలితం గణతంత్ర దినోత్సవం అని, మాతృభూమికోసం తమ ప్రాణాలను తృణప్రాయం చేసి బ్రిటిష్ వారితో పోరాడి మనకు స్వాతంత్ర్యం తెచ్చిపెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఉపేంద్రారెడ్డి, భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, నిర్మల్ ఏఎస్పీ రాజేశ్ మీనా, తదితరులు పాల్గొన్నారు.



క్యాంపు కార్యాలయంలో జెండాకు వందనం చేస్తున్న ఎస్పీ జానకీ షర్మిల, అధికారులు





సాంస్కృతిక నృత్య ప్రదర్శనలో చిన్నారులు



సావిత్రిబాయి పూలే పాటకు నృత్యం చేస్తున్న విద్యార్థినులు



పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీ షర్మిల

న్యూస్‌రీల్

గజ్జలమ్మ దేవికి పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: కుంటాల ఇలవేల్పు గజ్జలమ్మ, ముత్యాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్ల ఆలయాల్లో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. గురుస్వామి జక్కని గజేందర్, అర్చకుడు నగేష్ ఆధ్వర్యంలో అమ్మవార్లకు అభిషేకం అలంకరణ, అర్చన హారతి, తదితర పూజాది కార్యక్రమాలు చేపట్టారు. వివిధప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయకమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థ ప్రసాదం పంపిణీ చేశారు.

ప్రకృతి అందాలను తిలకించి.. పక్షులను కెమెరాల్లో బంధించి



తుర్కం చెరువు వద్ద పర్యాటకులు

మామడ: దక్కన్ బర్డ్స్ సొసైటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో 15 మంది పర్యాటకులు ఈ నెల 25, 26 తేదీల్లో మండలంలోని నల్దుర్తి, పొన్కల్ అటవీ ప్రాంతంలోని తుర్కం, యెంగన్న చెరువులను సందర్శించారు. శనివారం నేచర్ క్యాంపులో పాల్గొని దాదాపు 60 జాతుల పక్షులను గుర్తించి కెమెరాల్లో బంధించారు. అటవీ ప్రాంతంలో సఫారీ నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన పర్యాటకులు రాత్రిళ్లు బస చేసేందుకు అటవీశాఖ అధికారులు గుడారాలు, ఆహార పదార్థాలను సమకూర్చారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌ఆర్‌వో శ్రీనివాస్‌రావు, ఎఫ్‌ఎస్‌వోలు శ్రీనివాస్, అన్నపూర్ణ, ఎఫ్‌బీవోలు లక్ష్మీనర్సయ్య, సంజయ్, అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పురపాలన..

రాష్ట్రవ్యాప్తంగా 2020 జనవరి 26న మున్సిపాలిటీల్లో పాలకవర్గాలు కొలువు దీరగా ఐదేళ్ల పురపాలనకు ఆదివారంతో తెరపడింది. జిల్లాలోని మూడు మున్సిపాలిటీలకు సర్కారు నుంచి వచ్చిందేమీ లేదు.. ఇక్కడ పెద్దగా చేసిందీ లేదు. ఎన్నో ఆశలతో ఐదేళ్లక్రితం పట్టణ ఓటర్లు ఎన్నుకున్న పాలకవర్గాలూ నిధులు లేక నీరసంగానే నెట్టుకొచ్చాయి. కనీసం పాత పనుల కొనసాగింపు, అభివృద్ధి పనుల నిర్వహణ (మెయింటెనెన్స్) కూడా చేయలేక కుదేలయ్యాయి. రాష్ట్రంలో రాజకీయ మార్పు కూడా పాలకవర్గాలకు శాపంగా మారింది.



మున్సిపల్ పాలకవర్గం చివరి సమావేశంలో ప్రజాప్రతినిధులు, పాలకవర్గ సభ్యులు

- అంతంత మాత్రమే పురోగతి
- పెండింగ్‌లోనే 'అభివృద్ధి'
- ఐదేళ్ల పాలనకు పాస్‌మార్కులే..!

నిధులు లేక.. పనులు కాక..

నిర్మల్: ఐదేళ్లలో ప్రధానంగా నిర్మల్ బల్దియా 44 పోస్టుల పంచాయితీ, మాస్టర్‌ప్లాన్ అమలు, తదితర అంశాల్లో అప్రతిష్ట మూటకట్టుకుంది. కనీసం మెయింటెనెన్స్ లేకపోవడంతో గతంలో చేసిన అభివృద్ధి పనులూ మసకబారాయి. ఐదేళ్లలో చెప్పుకోదగ్గ పురోగతి అంటే కేంద్ర ప్రభుత్వం ద్వారా నిర్మల్ పట్టణానికి అమృత్ పథకం కింద రూ.63 కోట్ల నిధులు రావడమే. పట్టణాల్లో తాగునీటి కష్టాలు తప్పించడంతో పాటు డ్రెయినేజీ సమస్యల కోసం ఈ నిధులు ఉపయోగపడుతున్నాయి. టీయూఎఫ్‌ఐడీసీ, ఎస్‌డీఎఫ్ నిధులు రాకపోవడం మున్సిపాలిటీకి శాపంగా మారింది. దాదాపు రూ.80కోట్ల ప్రత్యేక నిధులు(ఎస్‌డీఎఫ్) రాలేదు. నిధుల లేమికి తోడు, పన్నుల వసూళ్లు సీరియస్‌గా చేయకపోవడమూ ఇబ్బందిగా మారింది.

పెండింగ్‌లోనే పనులు..

ఐదేళ్లలో నిర్మల్ మున్సిపాలిటీలో చాలా పనులు ఆరంభ శూరత్వమన్నట్లుగానే సాగాయి. పాలకవర్గం ఏర్పడిన కొత్తలో రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ఉండటం, ఇక్కడా వాళ్లే ఉండటంతో పనులను అట్టహాసంగా ఆరంభించారు. ఆ తర్వాత నిధులు లేవంటూ మధ్యలోనే చేతులెత్తేశారు. చైన్‌గేట్ నుంచి బంగల్‌పేట్ వరకు చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు ఈ ఐదేళ్లకాలంలో పూర్తికాకపోవడమే పెద్ద ఉదాహరణ. ఇప్పటికీ ఈ మార్గంలో డ్రెయినేజీల నీళ్లు రోడ్లపై పారుతుండటం గమనార్హం. శివారు కాలనీల్లో ఈ ఐదేళ్లు కూడా ఒక్కటంటే ఒక్క అభివృద్ధి పని కనిపించలేదు.

అప్రతిష్ట పాలు..

ఈ ఐదేళ్లలో నిర్మల్‌లో చేసిన అభివృద్ధి దేవుడెరుగు..! పైనుంచి అప్రతిష్టలను మూటకట్టుకోవాల్సి వచ్చింది. మున్సిపాలిటీలో నాల్గోతరగతి ఉద్యోగుల నియామకాలకు సంబంధించి 44 పోస్టుల ఎంపికలో అవకతవకలకు పాల్పడ్డారు. నిబంధనల ప్రకారం ఆ పోస్టులను ఇవ్వకుండా, పాలకవర్గంలో ఉన్నవారు తమ కుటుంబసభ్యులు, బంధువులు, అనుచరులకు కట్టబెట్టిన తీరు తలవంపులు తెచ్చిపెట్టింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందే మాస్టర్ ప్లాన్ విషయంలోనూ సరిగా అడ్డుకోలేదంటూ బల్దియాపై ఆరోపణలు వచ్చాయి. గత పాలకవర్గం హయాంలో జిల్లా కేంద్రంలో చేపట్టిన ఫుట్‌పాత్, సెంట్రల్‌లైటింగ్, ఫౌంటెయిన్స్, ఇతరత్రా సుందరీకరణ పనులను కనీసం మెయింటెనెన్స్ చేయకపోవడమూ పట్టణవాసులకు అసంతృప్తిని కలిగించింది. నిధులు లేక చాలామంది కౌన్సిలర్లు తమ వార్డుల్లో సొంత డబ్బులతో పనులు చేసుకున్నారు.

నిధులు లేకపోవడంతోనే..

గతంలో చైర్మన్‌గా ఉన్నప్పుడు పుష్కలంగా నిధులు వచ్చాయి. అప్పుడు చాలా పనులు చేశాం. ఈసారి పాలనలో నిధుల కొరత వేధించింది. రాజకీయంగా పార్టీ మారినా.. మున్సిపాలిటీకి నిధులు మాత్రం రాలేదు. ఐదేళ్లలో సాధ్యమైనంత వరకు పట్టణాభివృద్ధికి పాటు పడ్డాం.

– గండ్రత్ ఈశ్వర్, మున్సిపల్ చైర్మన్, నిర్మల్

ఐదేళ్లలో ఎంతో అభివృద్ధి..!



మున్సిపాలిటీలో నిర్మించిన వాటర్ ఫౌంటెయిన్

భైంసాటౌన్: ఐదేళ్ల పదవీకాలంలో పట్టణంలో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం తెచ్చిన పట్టణ ప్రగతి, ఎస్‌డీఎఫ్, 14,15 ఆర్థికసంఘం నిధులతో చేపట్టిన పనులు పరిశీలిస్తే... రూ.3 కోట్లతో చెత్త సేకరణ వాహనాలు, స్వీపింగ్ మెషిన్ కొనుగోలు చేశారు. డీబీఓటీ పద్ధతిలో జనసమ్మర్ద ప్రాంతాల్లో పబ్లిక్ టాయిలెట్స్ నిర్మించారు. హరిత హారంలో భాగంగా రూ.30 లక్షలతో నర్సరీలు ఏర్పాటు చేశారు. రూ.1.40కోట్లతో అత్యాధునిక వైకుంఠధామం నిర్మించారు. రూ.కోటితో పార్డి(బి)బైపాస్ మార్గంలో సైంటిఫిక్ డంపింగ్ యార్డు పనులు చేపట్టగా రూ.40 లక్షల వరకు పనులు పూర్తయ్యాయి. నిధులు లేక పనులు నిలిచాయి. రూ.7.20 కోట్లతో సమీకృత మార్కెట్ నిర్మాణం చేపట్టినా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మధ్యలోనే ఆగిపోయింది. రూ.5.17 కోట్లతో పట్టణంలోని ప్రధానరోడ్లుతో పాటు హైవేపై సెంట్రల్ లైటింగ్ హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు. రూ.1.60 కోట్లతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఇవే కాకుండా రూ.44.60 కోట్లతో మిషన్ భగీరథ, వీధి వ్యాపార దుకాణ సముదాయాలు, ఆధునిక చేపల మార్కెట్, బీఫ్ మార్కెట్ నిర్మాణం పూర్తి చేశారు. డాక్టర్స్‌లైన్ నుంచి నర్సింహానగర్ వరకు సీసీ రోడ్డు, ఇతర కాలనీల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టారు.

అభివృద్ధికి నోచని శివారు కాలనీలు...

కొన్ని కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు అధ్వాన్నంగా మారాయి. శిథిలావస్థకు చేరి మురుగునీరు రోడ్లపై పారుతోంది. శివారుకాలనీలు ఇప్పటికీ అభివృద్ధికి నోచుకోవడం లేదు. సీసీరోడ్లు, డ్రెయినేజీలు నిర్మించలేదు. కుంట ప్రాంతంలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసినా నిర్వహణ లేక పరికరాలు చోరీకి గురి కాగా, ప్రస్తుతం దాని స్థానంలో షాదీఖానా నిర్మిస్తున్నారు. ఆస్తిపన్ను, నీటిపన్ను బకాయిలు సకాలంలో వసూలు కాకపోవడంతో చెత్త సేకరణ వాహనాల నిర్వహణ, సిబ్బందికి వేతనాలు, తదితరవాటికి ఇబ్బందులున్నాయి. దీంతోపాటు ఏడాదిగా మున్సిపాలిటీకి ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో అభివృద్ధి పనులు చేపట్టలేదు.

అభివృద్ధి చేశాం

ఐదేళ్ల పాలనలో భైంసా పట్టణంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశాం. ముఖ్యంగా పట్టణ ప్రజలకు తాగునీటి ఇబ్బంది లేకుండా మిషన్ భగీరథ పనులు చేయించాం. రూ.1.40కోట్లతో ఆధునిక వైకుంఠధామం అందుబాటులోకి తీసుకొచ్చాం. పట్టణంలోని ప్రధాన రోడ్డు, హైవే వెంబడి సెంట్రల్ లైటింగ్, డివైడర్ల మధ్యలో మొక్కల పెంపకం చేపట్టాం. బీఆర్‌ఎస్ హయాంలో పట్టణ ప్రగతి నిధులు వచ్చేవి. ఏడాది కాలంగా నిధులు లేకపోవడంతో కొన్ని పనులు చేపట్టలేకపోయాం.

– ఎండీ జాబీర్ అహ్మద్, వైస్‌చైర్మన్, భైంసా

సమస్యలు ఘనం.. పరిష్కారం శూన్యం



వరదకు కొట్టుకుపోయిన వైకుంఠధామం

ఖానాపూర్: నియోజకవర్గ కేంద్రమైన ఖానాపూర్ మున్సిపాలిటీలో ఐదేళ్లలో అభివృద్ధి అంతంత మాత్రంగానే జరిగింది. పట్టణంలో సమస్యలు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నచందంగా ఉన్నాయి. ప్రధానంగా రోడ్డు వైడింగ్ అసంపూర్తిగా ఉండడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. సమీకృత మార్కెట్ పూర్తికాక, వారసంతకు సరిపడా స్థలం లేక రైతులు, ప్రజలు, వ్యాపారులు నానా ఇక్కట్లు పడుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిని 100 పడకలతో ఏరియా ఆస్పత్రిగా చేస్తామని ఇచ్చిన హామీ నెరవేరలేదు. మినీ స్టేడియంలో నిర్వహణలేక అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. అగ్నిమాపక కేంద్రానికి సొంతభవనం లేక మార్కెట్ యార్డులో కొనసాగిస్తున్నారు. పట్టణ శివారులోని గోదావరి తీరంలో సుమారు రూ.50 లక్షలకు పైగా నిధులు వెచ్చించి నిర్మించిన వైకుంఠధామం ఏటా వరదలో కొట్టుకుపోతూ తీవ్ర నష్టం వాటిల్లుతోంది. మున్సిపాలిటీకి సొంతభవనంలేక శిథిలభవనంలో నిర్వహిస్తున్నారు. తహసీల్దార్ క్వార్టర్స్‌లో రూ.3 కోట్లతో నిర్మించతలపెట్టిన సమీకృత మార్కెట్ మధ్యలోనే నిలిచిపోయింది. రెంకోని వాగుపై ఏడాదిక్రితం రూ.9 కోట్లతో చేపట్టిన వంతెన నిర్మాణ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. రూ.2 కోట్లతో చేపట్టిన రోడ్డు డివైడర్ పనులు అసంపూర్తిగానే ఉన్నాయి.

చేపట్టిన పనులు...

ఎన్టీఆర్ చౌరస్తాలో రూ.60 లక్షలకు పైగా నిధులతో పట్టణ పార్కును ఏర్పాటు చేశారు. రూ.22 కోట్లతో 'అమృత్'–2 కింద తాగునీటి ట్యాంకు ట్యాంకుల ఏర్పాటు పనులు, రూ.4.80 కోట్లతో సీసీరోడ్లు, డ్రెయినేజీ పనులు ప్రారంభించారు. ఫ్లడ్ డ్యామేజ్ కింద జేకేనగర్, రాజీవ్‌నగర్‌లలో రూ.20 లక్షలతో డ్రెయినేజీ నిర్మాణం చేపట్టారు. గాంధీనగర్‌లో బస్తీ దవాఖానా ఏర్పాటు చేశారు. రూ.90 లక్షలతో సెంట్రల్ లైటింగ్ పనులు చేపట్టారు.

అనతికాలంలోనే అభివృద్ధి



కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సహకారంతో అభివృద్ధి పనులు చేపట్టాం. అసంపూర్తిగా ఉన్న పట్టణ పార్క్‌ను పూర్తిచేశాం. రూ.20 లక్షల ఫ్లడ్ డ్యామేజ్ నిధులతో డ్రెయినేజీ నిర్మించాం. రూ.కోటి నిధులతో పారిశుధ్య, ఇతర సిబ్బంది వేతనాలతో పాటు పెండింగ్ బిల్లులు చెల్లించాం.

– చిన్నం సత్యం, మున్సిపల్ చైర్మన్, ఖానాపూర్

క్లుప్తంగా

మున్సిపల్ ప్రత్యేకాధికారిగా ఫైజాన్ అహ్మద్

భైంసాటౌన్: మున్సిపల్ పాలకవర్గాలకు గడువు ముగిసిన నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. ఈ మేరకు ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీలకు అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్) ఫైజాన్ అహ్మద్ ప్రత్యేకాధికారిగా వ్యవహరించనున్నారు. సోమవారం నుంచి బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.

ఆర్జీయూకేటీలోకి మీడియాకు అనుమతి నిరాకరణ

బాసర(ముథోల్): బాసరలోని ఆర్జీయూకేటీలో జరుగుతున్న గణతంత్ర వేడుకలకు అధికారులు మీడియాకు అనుమతి నిరాకరించారు. ప్రతీ సంవత్సరం స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవ వేడుకలకు విశ్వవిద్యాలయం తరఫున అధికారుల నుంచి మీడియాకు ఆహ్వానం అందేది. అయితే ఈసారి మీడియాకు అనుమతిలేదని అధికారులు పేర్కొన్నారు. ఈ విషయమై పీఆర్వో విజయ్‌కుమార్‌ను ఫోన్‌లో సంప్రదించగా మీడియాకు ఎలాంటి అనుమతిలేదని, ఏదైనా ఉంటే మేమే ఫొటోలు, వీడియోలు తీసి పంపిస్తామన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి


నగేశ్ (ఫైల్)

జన్నారం: బైక్ అదుపుతప్పడంతో వ్యక్తి మృతి చెందినట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని చింతగూడకు చెందిన పూదరి నాగేష్ (47) గత కొన్ని నెలలుగా జన్నారంలో ఇల్లు కట్టుకున్నాడు. ఇటీవల ఇరాక్ నుంచి వచ్చిన ఆయన శని వారం అర్ధరాత్రి చింతగూడ నుంచి జన్నారానికి బైక్‌పై తిరిగివస్తున్నాడు. పైడిపెల్లి గ్రా మ సమీపంలోని మెయిన్ రోడ్డుపై అదుపు తప్పి కిందపడ్డాడు. తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. తండ్రి లచ్చన్న ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య లత, ఒక కుమార్తె, ఒక కుమారుడు ఉన్నాడు.

పిచ్చికుక్క దాడిలో బాలుడికి గాయాలు


గాయపడిన అంకులు

పెంచికల్‌పేట్: మండలంలోని గొంట్లపేట్ బస్టాండ్ సమీపంలో ఆదివారం పిచ్చికుక్క దాడిలో బాలుడికి తీవ్ర గాయాలయ్యా యి. ఇంటి బయట ఆడుకుంటున్న జాడి అంకులు (4)పై పిచ్చికుక్క దాడి చేయగా అతని ముఖంపై గాయాలయ్యాయి. అతడి అరుపులు విన్న స్థానికులు అక్కడికి చేరుకుని పిచ్చికుక్కను తరిమారు. కుటుంబ సభ్యులు బాలుడిని కాగజ్‌నగర్ ఆస్పత్రికి అక్కడి నుంచి మంచిర్యాలకు తరలించారు.


ప్రశంసపత్రం అందుకుంటున్న అదనపు ఎస్పీ రాజేష్ మీనా

ఉత్తమసేవలకు గుర్తింపు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో ఆదివారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో ఉత్తమ సేవలందించిన 240 మంది ఉద్యోగులు ప్రశంసాపత్రాలు అందుకున్నారు. కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ డాక్టర్ జానకీ షర్మిల వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు.


ఉపేందర్ రెడ్డి, ఏఎస్పీ | ఎల్.కిషోర్‌కుమార్, అదనపు కలెక్టర్ | టి.శంకరయ్య, ఈఈ,పీఆర్ | డాక్టర్ రాజేందర్, డీఎంహెచ్‌వో | కిరణ్‌కుమార్, డీసీఎస్వో | అంజి ప్రసాద్, డీఏవో | జీవరత్నం, సీపీవో


కోమల్‌రెడ్డి, ఆర్డీవో, భైంసా | రత్నకళ్యాణి, ఆర్డీవో, నిర్మల్ | రాంగోపాల్, లీడ్ బ్యాంకు మేనేజర్ | విష్ణువర్ధన్, డీపీఆర్వో | శ్రీనివాస్, డీపీవో | విజయలక్ష్మి, డీఆర్డీవో | రామారావు, డీఈవో | బి.సురేష్, డీసీహెచ్‌ఎస్


శ్రీకాంత్‌రెడ్డి, స్పోర్ట్స్ అధికారి | రాజ్‌కుమార్, తహసీల్దార్, నిర్మల్ అర్బన్ | సూర్యారావు, ఏవో, కలెక్టరేట్ | బారె రవీందర్, వైద్యశాఖ | డి.సరిత, సూపరింటెండెంట్, కలెక్టరేట్ | అశోక్, డ్రైవర్, ఏసీఎల్ఎల్బీ | సైదారావ్, సీఐ, ఖానాపూర్ | ఎం.జ్యోతి, కోఆర్డినేటర్


శ్రీలత, డబ్ల్యూపీసీ, లక్ష్మణచాంద | ఎస్.పొచ్చన్న, పీసీ, దిలావర్పూర్ | యోగేశ్వర్, హాస్టల్ వార్డెన్, బీసీ వెల్ఫేర్ | రంజిత్, లెక్చరర్, ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ | ఎస్.రాజమల్లు, అసిస్టెంట్ రిజిస్టర్, కోపరేటివ్ ఆఫీస్ | ఆసిఫ్, ఆఫీస్ సబార్డినేట్, డీఆర్డీఏ | జి.శకుంతల, ప్రిన్సిపాల్, నర్సింగ్ కళాశాల | లిఖిత్‌రెడ్డి, కానిస్టేబుల్, ఆర్టీవో | దీపక్, సీనియర్ అసిస్టెంట్, టీవీవీపీ | మధుసూదన్‌రెడ్డి, టీహబ్, మేనేజర్ | మనీషా, పీహెచ్‌సీ, బంగల్‌పేట్ | సింధు, ఎస్సై, డీటీఎఫ్ | శ్రీధర్‌రెడ్డి, ట్రాఫిక్ సూపర్‌వైజర్, ఆర్టీసీ


పూజారెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ జైనకాలజీ | నారాయణ, సూపరింటెండెంట్, జెడ్పీ | డాక్టర్ అపూర్వ, భైంసా ఏ.ఆస్పత్రి | డాక్టర్ రజనీకాంత్, భైంసా ఏరియాస్పత్రి | వినోద్, డాటా ఎంట్రీ ఆపరేటర్, డీవైఎస్‌వో | సరిత, మిషన్ శక్తి | భాగ్యవతి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ | వరలక్ష్మి, జూ. అసిస్టెంట్, ఐసీడీఎస్ | సజన, మార్కెట్ ఎగ్జిక్యూటివ్ | అనూష, ఆశ, బంగల్‌పేట్ | గంగాప్రసాద్, సీసీ, డీఆర్డీఏ | రాధా రాథోడ్, జీపీ స్పెషల్ ఆఫీసర్ | ఆర్.వెన్నెల, పీఈటీ


ఉత్తమ ఉద్యోగులను సన్మానిస్తున్న అధికారులు


శ్రీరాంపూర్: విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన


మందమర్రిరూరల్: విద్యార్థుల నృత్యాలు

రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

- గనులపై గణతంత్ర వేడుకలు
- జాతీయ జెండావిష్కరించిన జీఎంలు
- ఉత్తమ ఉద్యోగులకు సన్మానం


జెండాకు వందనం చేస్తున్న మందమర్రి ఏరియా జీఎం


శ్రీరాంపూర్: జాతీయ జెండా ఎగురవేసి వందనం సమర్పిస్తున్న జీఎం సూర్యనారాయణ


శ్రీరాంపూర్: హెచ్‌ఎంఎస్ కార్యాలయం వద్ద ..

శ్రీరాంపూర్/మందమర్రిరూరల్: సింగరేణి గనులు, కార్మికవాడల్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. సింగరేణి ఆధ్వర్యంలో 76వ గణతంత్ర వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. శ్రీరాంపూర్ ప్రగతి మైదానంలో, తన కార్యాలయం వద్ద శ్రీరాంపూర్ జీఎం ఎల్వీ సూర్యనారాయణ, మందమర్రిలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో జీఎం దేవేందర్ దంపతులు జాతీయ జెండాలు ఆవిష్కరించారు. శ్రీరాంపూర్ జీఎం మాట్లాడుతూ నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధిస్తేనే సింగరేణి ప్రగతి సాధిస్తుందని తెలిపారు. రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలో 18 మంది, మందమర్రి ఏరియాలో 12 మంది ఉత్తమ ఉద్యోగులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గని వద్ద పీవో టి.శ్రీనివాస్, శ్రీరాంపూర్ బస్టాండ్‌లోని ఆటో యూనియన్ కార్యాలయం వద్ద నాయకుడు ముఖేష్‌గౌడ్, హెచ్‌ఎంఎస్ యూనియన్ కార్యాలయం వద్ద కేంద్ర కార్యదర్శి గొల్ల సత్యనారాయణలు జాతీయ జెండాలు ఎగురవేశారు. కంపెనీ విజిలెన్స్ వారోత్సవాల సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. అనంతరం వారు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఎస్‌ఓటు జీఎం సత్యనారాయణ, సేవా అధ్యక్షురాలు మాలతి, ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి షేక్ బాజీ సైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజీఎం ఫైనాన్స్ మురళీధర్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో..


జాతీయ జెండా ఎగురవేస్తున్న వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్

భైంసా: బాసర ట్రిపుల్ ఐటీలో వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్, ఓఎస్డీ మురళీదర్శన్, ఏవో రణధీర్ సాగిలు మహనీయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వీసీ గోవర్ధన్ జాతీయ జెండావిష్కరించారు. ఎన్‌సీసీ విద్యార్థులు ప్రదర్శించిన కవాతు ఆకట్టుకుంది. వ్యాసరచన పోటీల్లో పాల్గొని విజేతలుగా నిలిచినవారికి బహుమతులు అందజేశారు. అసోసియేట్ డీన్ డాక్టర్ విఠల్, సెక్యూరిటీ ఆఫీసర్ డాక్టర్ రాజేష్, చీఫ్ వార్డెన్ మధుసూదన్‌రెడ్డి, స్పోర్ట్స్ కన్వీనర్ ప్రభాకర్, శ్యాంబాబు, రవికిరణ్, రఘువీర్, స్వప్న, విజయ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో బెటాలియన్‌కు ప్రథమ స్థానం


బహుమతి అందుకుంటున్న అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): గణతంత్ర వేడుకల్లో భాగంగా ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో పరేడ్‌లో గుడిపేట 13వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ నుంచి పాల్గొన్న కాంటిజెంట్ ప్రథమ బహుమతి సాధించింది. అసిస్టెంట్ కమాండెంట్ ఆర్.నాగేశ్వర్‌రావు, ఆర్‌ఐ ఎం.శ్రీనివాస్, ఆర్ఎస్సైలు రవి, రాజశేఖర్, సిబ్బంది మొత్తం 40 మంది ఉన్నారు. రాష్ట్రం నుంచి పాల్గొని ప్రథమ స్థానం కైవసం చేసుకుంది. గవర్నర్ రామెన్ దేఖా, డీజీపీ అశోక్‌జునేజా బహుమతి అందజేశారు. బెటాలియన్ కమాండెంట్ వెంకటరాములు, ఆర్‌ఐలు సిబ్బంది వారిని అభినందించారు.

- గుడిపేట బెటాలియన్‌లోని పరేడ్ మైదానంలో కమాండెంట్ వెంకటరాములు జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. మెడికల్ అధికారులు సంతోశ్‌సింగ్, ఆర్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. ఆర్ఎస్సైలు, ఏఆర్ఎస్సైలు, కానిస్టేబుళ్లకు ఉత్కృష్ట పతకాలను కమాండెంట్ అందజేశారు.

గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి జిల్లాలోని గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఐటీడీఏ కృషి చేస్తోందని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పేర్కొన్నారు. 76వ గణతంత్ర వేడుకలు పురస్కరించుకొని ఆదివారం ఐటీడీఏ ప్రాంగణంలో మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరిబాయిలతో కలిసి ఐటీడీఏ పీవో జాతీయజెండా ఎగురవేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. విద్యతోనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గిరిజనుల కోసం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులు బాగా చదివి ఐపీఎస్, ఐఏఎస్‌లుగా రాణించాలన్నారు. అనంతరం ఐటీడీఏ ద్వారా గిరిజనాభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను పీవో వివరించారు. 11 మండలాల్లో 11 పీహెచ్‌సీల్లో అవ్వల్ అంబులెన్స్ ద్వారా 2023–24లో 2644 మంది గర్భిణులకు ప్రసవాలు జరిగినట్లు తెలిపారు. అంతకుముందు ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు నృత్యాలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఉత్తమ ఉద్యోగులుగా ఎంపికైన వారిని సర్టిఫికెట్లు అందజేశారు. ఏపీవో జనరల్ వసంత్ రావు, ఏపీవో పీవీటీజీ మెస్రం మనోహర్, ఈఈ తానాజీ పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరిస్తున్న ఖుష్బూ గుప్తా

ఒకరిపై అట్రాసిటీ కేసు

లక్సెట్టిపేట: మండలంలోని చందారం గ్రామానికి చెందిన మిల్క్యూరు మల్లేశ్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. రంగపేట గ్రామానికి చెందిన ఆవునూరి రాజయ్యకు వారసత్వంగా వచ్చిన భూమిలో సాగు చేసుకుంటున్నాడు. అయితే పల్లికొండ రమేశ్ నుంచి ఆ భూమిని కొనుగోలు చేశానని మల్లేశ్ శనివారం ట్రాక్టర్ వీల్స్‌తో పంటను ధ్వంసం చేశాడు. అడ్డుకోబోయిన రాజయ్యను కులం పేరుతో దూషించి నెట్టివేశాడు. బాధితుడు రాజయ్య ఫిర్యాదుతో ఆదివారం అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

సిరి'కుండ'లోనే నాగోబా నైవేద్యం


జాతర కోసం తయారుచేసిన కుండలు

ఇచ్చోడ: ఆదివాసీల ఆరాధ్య దైవం నాగో బాకు అభిషేకం చేయాలన్నా .. నైవేద్యం సిద్ధం చేయాలన్నా సిరికొండ కుండలనే వాడుతారు. శతాబ్దాలుగా సిరికొండలోని గుగ్గిల వంశీయులు తయారు చేసిన కుండలోనే నైవేద్యం సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. నాగోబా అప్పట్లో మె స్రం వంశీయులకు కలలో వచ్చి సిరికొండలో నివసిస్తున్న గుగ్గిల వంశీయులు త యారు చేసిన కుండలనే పూజలకు ఉపయోగించాలని చెప్పినట్లు ప్రతీతి. పూజ ప్రారంభం నుంచి అఖరి రోజు నైవేద్యం సమర్పించే వరకు ఇక్కడి కుండలనే వాడుతారు.

ప్రచారయాత్రలోనే కుండల తయారీకి ఆర్డర్

కేస్లాపూర్ నాగోబా ఆలయం నుంచి ప్రారంభమైన కటోడ మెస్రం కోసేరావు, పర్ధాన్ దాదారావులతో కూడిన ప్రచారం రథం(ఎడ్లబండి) మొదటిరోజే సిరికొండ మండల కేంద్రంలో ఉన్న గుగ్గిల స్వామి ఇంటికి చేరుకొని జాతరకు అవసరమయ్యే కుండల తయారీకి ఆర్డర్ ఇస్తారు. మరుసటి రోజు నుంచే కుండల తయారీ ప్రారంభిస్తారు. తయారైన కుండలకు మహాజాతర ప్రారంభానికి రెండు రోజుల ముందు మెస్రం వంశీయులు పూజలు నిర్వహించి ఎడ్లబండిపై కేస్లాపూర్‌కు తీసుకెళ్తారు.

ఏడు రకాలు.. 350 మట్టిపాత్రలు

20 పెద్ద బాణాల్లో గంగాజలం పోసి నిల్వ ఉంచుతారు. 55 నీటి కుండలు, 55 మూతలు, 45 కడుముంతలు, 150 దీపాంతలు, 25 పెంకలను ఆదివాసీలు ఆలయ పరిసర ప్రాంతాల్లో పిండివంటలు, నైవేద్యాలు తయారు చేయడానికి వాడుతారు. వీటి తయారీకి గుగ్గిల స్వామి, అతని భార్య నెలరోజుల పాటు కష్టపడుతారు. స్వామి తండ్రి రాజన్న 75 ఏళ్లపాటు కుండలు తయారు చేసి అందించారు. రాజన్న తండ్రి రాజన్న సైతం 70 ఏళ్లు కుండలను తయారు చేసి ఇచ్చారు. ప్రస్తుతం స్వామి దాదాపు 40 ఏళ్లుగా కుండలను తయారు చేసి ఇస్తున్నారు.

తరాల నుంచి..



తరతరాలుగా తాతముత్తాల నుంచి కుండలు తయారీ చేసి నాగోబాకు ఇస్తున్నాం. నాగోబా జాతర ప్రారంభం నుంచి మా వంశమే కుండలను తయారు చేస్తుంది.

– గుగ్గిల స్వామి, సిరికొండ

ఆచారం కోసం నేర్చుకుంటున్నా..



కుండ తయారీ ఉపాధిని ఇవ్వడం లేదు. దశాబ్దాల నుంచి తమ వంశమే నాగోబా జాతరకు కుండలు తయారు చేసి ఇస్తున్నాం. ఆచారం కోసం తండ్రి వద్ద కుండల తయారీ నేర్చుకుంటున్నాను.

–గుగ్గిల గంగాధర్, గుగ్గిల స్వామి కుమారుడు

తయారీకి నెల సమయం..



ఏడు రకాలుగా 350 మట్టిపాత్రల తయారీకి నెల సమయం పడుతుంది. అడవి నుంచి మట్టిని తీసుకురానివ్వడంలేదు. దూరప్రాంతాల నుంచి మట్టిని డబ్బులతో కొనుగోళ్లు చేస్తున్నాం. వీటిని విక్రయిస్తే రూ.50 వేలు వస్తాయి. కాని కేవలం రూ.10 వేలు ఇస్తున్నారు. దైవకార్యమని కుండలను తయారీ చేసి ఇస్తున్నాం.

– గుగ్గిల కళావతి, గుగ్గిలస్వామి భార్య

బాలాజీ మందిర్‌లో చోరీ


ఆలయంలో పరిశీలిస్తున్న నాయకులు, కౌన్సిలర్

భైంసాటౌన్: పట్టణంలోని భైంసా–నిర్మల్ జాతీయ రహదారి పక్కన, కైలాష్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో గల బాలాజీ మందిర్‌లో చోరీ జరిగింది. ఆదివారం ఉదయం ఆలయానికి నిర్వాహకులు చేరుకోగా, తాళం పగులగొట్టి తలుపు తెరిచి ఉంది. దీంతో వెంటనే పోలీసులకు సమాచారమివ్వగా, ఏఎస్పీ అవినాష్‌కుమార్, సీఐ గోపినాథ్ ఆలయానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్‌టీంతో ఆధారాలు సేకరించారు. స్వామివారి కిరీటం, రెండు గ్రాముల బంగారం వస్తువులు, శఠగోపం చోరీకి గురైనట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. హిందూవాహిని మహిష నాయకులు మహేశ్, రాము, కౌన్సిలర్ గౌతంపింగ్లే చేరుకుని ఆలయాన్ని పరిశీలించారు. ఆలయాల్లో చోరీ ఘటనలపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.